

ఎర్రజొన్నకు బదులు..

ఎర్రజొన్న వ్యాపారుల మోసాలతో రైతులు విసిగిపోతున్నారు. ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న వైపు మొగ్గు చూపుతున్నారు.

- 10లో ▸



విద్యార్థులకు ఇబ్బందులు..

బెస్ట్ అవైలబుల్ విద్యార్థులకు యాజమాన్యాలు ఇబ్బందులు కలిగించొద్దని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి సూచించారు.

- 10లో ▸

గరిష్టం/కనిష్టం

33.2 /21.5

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. చల్లని గాలులు వీస్తాయి. ఉదయం నుంచి అక్కడక్కడ ఉరుములతో కూడిన వర్షాలు కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

వైన్ షాపులకు 419 దరఖాస్తులు

నిజామాబాద్ అర్బన్: జిల్లాలోని మద్యం దుకాణాలకు బుధవారం 157 దరఖాస్తులు అందినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 102 వైన్ షాపులకు ఇప్పటివరకు మొత్తం 419 దరఖాస్తులు అందాయని పేర్కొన్నారు. ఈ నెల 18వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని, ఆసక్తి గలవారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఎస్సారెస్పీలోకి తగ్గుతూ.. పెరుగుతున్న ఇన్‌ఫ్లో

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ నుంచి ఇన్‌ఫ్లో తగ్గుతూ.. పెరుగుతోంది. దీంతో వరద గేట్ల ద్వారా గోదావరిలోకి నీటి విడుదలను తగ్గిస్తూ పెంచుతున్నారు. ఎగువ నుంచి 34 వేల క్యూసెక్కుల నీరు రావడంతో బుధవారం మధ్యాహ్నం గోదావరిలోకి 8 వరద గేట్ల ద్వారా 25 వేల క్యూసెక్కుల నీటిని వదిలారు. సాయంత్రానికి ఇన్‌ఫ్లో తగ్గుముఖం పట్టి 22,290 క్యూసెక్కులకు పడిపోవడంతో అవుట్‌ఫ్లోను 12,500 క్యూసెక్కులకు తగ్గించారు. కాకతీయ కాలువ ద్వారా 5 వేల క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా 3 వేలు, సరస్వతి కాలువ ద్వారా 650, లక్ష్మి కాలువ ద్వారా 200 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా, ఆవిరి రూపంలో 709 క్యూసెక్కుల నీరుపోతోంది. మిషన్ భగీరథ అవసరాలకు 231 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు. పూర్తి స్థాయి నీటి మట్టంతో ప్రాజెక్ట్ నిండు కుండలా ఉందని అధికారులు తెలిపారు.

గోదావరిలో వ్యర్థాలను తొలగించాలి

బాల్కొండ: గోదావరిలో వ్యర్థాలను తొలగించాలని గోదావరి రివర్ బోర్డు సభ్యులు సూచించారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ వద్ద గోదావరిని సభ్యులు బుధవారం సందర్శించారు. గోదావరిని కాపాడుకోవాలని ప్రతిజ్ఞ చేశారు. నదిలోని చెత్త ను తొలిగించారు. గోదావరి రివర్ బోర్డు చైర్మన్ బీపీ పాండ్యా, సభ్యులు రంగారాజన్, వేణుగోపాల్, పద్మిని, ఎస్సారెస్పీ ఈఈ చక్రపాణి, అధికారులు సుకుమార్, సురేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రధాన పోస్టులు ఖాళీ

రోగులకు మెరుగైన వైద్య సేవలందించాల్సిన జిల్లా కేంద్ర ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ప్రధాన పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇన్‌చార్జీల పాలన కారణంగా రోగులకు పూర్తిస్థాయిలో సేవలందకపోగా, ఎక్కడ కూడా జవాబుదారీతనం కనిపించడం లేదు.

- ఇన్‌చార్జీల పాలనలో జీజీహెచ్
- క్యాథ్‌లాబ్ ఉన్నా ఉపయోగం లేదు
- పూర్తిస్థాయి అధికారుల నియామకం ఎన్నడో..?
- రోగులకు అడుగడుగునా ఇబ్బందులు



నిజామాబాద్‌నాగారం: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ముఖ్యమైన పోస్టుల్లో ఇన్‌చార్జీలు కొనసాగతుండడంతో ఇటు రోగులకు పూర్తిస్థాయిలో వైద్య సేవలందక పోగా, అటు ఎక్కడ కూడా జవాబుదారీతనం కనిపించడం లేదు! ప్రతిరోజూ రెండు వేలకు పైగా ఓపీ నమోదవుతున్నా ఏళ్లుగా ఇన్‌చార్జీలతో నెట్టుకొస్తున్నారు. గుండె జబ్బులకు సంబంధించి క్యాథ్‌లాబ్ ఏర్పాటు చేసి రెండేళ్లవుతున్నా వైద్యుడు లేకపోవడంతో మూసే ఉంటోంది.

జీజీహెచ్‌కు అతి ముఖ్యమైన సూపరింటెండెంట్ పోస్టు ఏళ్లుగా ఖాళీగానే ఉంది. గత 12 ఏళ్లలో డాక్టర్ వాలీయాను మాత్రమే ప్రభుత్వం రెగ్యులర్ సూపరింటెండెంట్‌గా నియమించినప్పటికీ ఆయన ఇటువైపు కన్నెత్తి చూడలేదు. ఇటీవల చేపట్టిన బదిలీల్లో భాగంగా జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా మాల కొండారెడ్డిని పంపించినప్పటికీ ఆయన విముఖత చూపారు. ఆయన ఏకంగా కోర్టుకు వెళ్లారు. దీంతో ఇన్‌చార్జీ సూపరింటెండెంట్‌లే జీజీహెచ్‌కు దిక్కవుతున్నారు. అత్యంతకీలకమైన ఏడీ, ఏవో పోస్టులు ఏడాది కాలంగా ఖాళీగానే ఉన్నాయి. దీంతోపాటు సీనియర్ అసిస్టెంట్, ఇతర కిందిస్థాయి పోస్టులు సైతం ఖాళీగా ఉన్నాయి. ముఖ్యమైన పోస్టుల్లో అంతా ఇన్‌చార్జీలే ఉండడంతో తమపై పనిభారం పడుతోందని కిందిస్థాయి రెగ్యులర్ అధికారులు, సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గుండె వైద్యులు లేరు..

జీజీహెచ్‌కు గుండెకాయ వంటిదైన క్యాథ్‌లాబ్ ఏర్పాటు చేసి రెండేళ్లు గడుస్తున్నా సంబంధిత వైద్యులు లేరు. రూ.లక్షలు వెచ్చించి ప్రభుత్వం లాబ్‌ను ఏర్పాటు చేసింది. గుండె వైద్యులు లేకుంటే రోగులకు వైద్య సేవలు ఏ విధంగా అందుతాయని పలువురు ప్రశ్నిస్తున్నారు. ప్రతినిత్యం పదుల సంఖ్యలో గుండె సంబంధిత రోగులు ప్రైవేట్ ఆస్పత్రుల వైపు పరుగులు తీస్తున్నారు. ప్రతీ నెలా 450 మందికి పైగా రోగులు ప్రైవేట్ ఆస్పత్రుల్లో గుండె సంబంధిత చికిత్స పొందుతున్నారు. వీరిలో 150 మందికి పైగా రోగులు స్టంట్‌లు వేసుకుంటున్నారు. 40 మందికి పైగా బైపాస్ సర్జరీలు అవుతున్నాయి. జీజీహెచ్‌లో క్యాథ్‌ల్యాబ్ పనిచేస్తే రోగులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

ప్రొఫెసర్లు లేరు..

జనరల్ మెడిసిన్, ఆర్థో, గైనిక్, పీడియాట్రిక్, ఆప్తాల్మిక్, ఈఎన్‌టీ, రేడియాలజీ, డీవీఎల్, జనరల్ సర్జన్, డెంటల్ తదితర విభాగాల హెచ్‌వోడీలు ఉన్నారు. అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులు ఒక్కో విభాగంలో 30కి పైగా ఖాళీగా ఉన్నాయి. దీంతో సీనియర్ రెసిడెంట్, జూనియర్ రెసిడెంట్‌లపైనే పనిభారం పడుతోంది. రోజురోజుకూ జీజీహెచ్‌లో ఓపీ సంఖ్య పెరుగుతున్నా సౌకర్యాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. కనీసం వైద్యుల పోస్టులు భర్తీ చేస్తేనైనా పూర్తిస్థాయి వైద్య అందుతుందని రోగులు, వారి సహాయకులు అంటున్నారు.



మెరుగైన సేవలందిస్తున్నాం

జీజీహెచ్‌లో ఖాళీల భర్తీ మా చేతుల్లో లేదు. ప్రస్తుతం ఉన్న వైద్యులతో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నాం. రోగులకు వైద్య సేవల విషయంలో ఇబ్బందులు ఉంటే మా దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తాం.

– శ్రీనివాస్, జీజీహెచ్ సూపరింటెండెంట్



మక్క కొనుగోళ్లపై సహకార సంఘాల సిబ్బందికి ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్

మక్క కొనుగోళ్లకు పచ్చ జెండా

- మార్క్‌ఫెడ్‌కు ప్రభుత్వం నుంచి మౌఖిక ఆదేశాలు
- జిల్లాలోని 26 సహకార సంఘాల్లో కొనుగోలు కేంద్రాల ఏర్పాటు
- నేటి నుంచి ప్రారంభం కానున్న కొనుగోళ్లు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : మొక్కజొన్న కొనుగోళ్లకు రాష్ట్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో గురువారం నుంచి సహకార సంఘాల్లో కేంద్రాలను ఏర్పాటు చేసి, కొనుగోళ్లను ప్రారంభించాలని మార్క్‌ఫెడ్ అధికారులకు ఇప్పటికే మౌఖిక ఆదేశాలు అందాయి. తక్షణమే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసుకోవాలని సహకార సంఘాలకు సూచనలు వచ్చాయి. దీంతో బుధవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో మార్క్‌ఫెడ్ అధికారులు సొసైటీల నిర్వాహకులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మొక్కజొన్న పంట దిగుబడులను రైతుల నుంచి పక్కాగా సేకరించాలని అదనపు కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా 14 మండలాల్లో మొత్తం 26 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు రంగం సిద్ధం చేశారు. కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించి రైతులకు క్వింటాల్‌కు మద్దతు ధర రూ.2,400 దక్కేలా చర్యలు తీసుకోవాలన్నారు. కాగా జిల్లాలో ఈ సీజన్‌లో 52,093 ఎకరాల్లో మొక్కజొన్నను రైతులు సాగుచేశారు. పంట కోతలు మొదలై మూడు వారాలు దాటింది.

అయితే మక్క కొనుగోలు కేంద్రాల ఏర్పాటును ప్రభుత్వం ఆలస్యం చేయడంతో 40 శాతం పంటను రైతులు ఇప్పటికే ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకోవాల్సి వచ్చింది. ప్రతికూల వాతావరణం నేపథ్యంలో పలువురు రైతులు తక్కువ ధరకే అమ్ముకున్నారు. ఈ క్రమంలో తాజాగా మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనుండడంతో పంట చేతిలో ఉన్న రైతులు తమకు మద్దతు ధర దక్కనుందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గు రువారం నిజామాబాద్ రూరల్, ఆర్మూర్ నియోజకవర్గాల్లో ప్రజాప్రతినిధులు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నారు.

మంత్రి తుమ్మలకు లేఖ రాశా

రాష్ట్రవ్యాప్తంగా 6 లక్షల ఎకరాల్లో రైతులు మొక్కజొన్న సాగు చేశారు. జిల్లాలోనే ముందుగా పంట చేతికి వచ్చింది. కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో రైతులు దళారులకు రూ.1900కే అమ్ముకున్నారు. దీంతో మార్క్‌ఫెడ్ ద్వారా మక్క కొనుగోళ్లు చేయాలని కోరుతూ గత నెల 23వ తేదీన మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు లేఖ రాశా. మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోళ్లకు ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, డాక్టర్ భూపతిరెడ్డి చొరవ తీసుకున్నారు. రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి. – ఎస్. అన్వేష్‌రెడ్డి, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్

ఆదేశాలు అందాయి

జిల్లాలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసుకోవాలని రాష్ట్ర శాఖ నుంచి మౌఖిక ఆదేశాలు అందాయి. దీంతో వెంటనే సమాచారాన్ని సహకార సంఘాలకు చేరవేశాం. గురువారం మొదటగా జక్రాన్‌పల్లి మండలం మునిపల్లిలో కొనుగోలు కేంద్రం ప్రారంభించనున్నాం. జిల్లాలో 26 చోట్ల వీటిని ఏర్పాటు చేయనున్నాం. రైతులు కేంద్రాలను సద్వినియోగం చేసుకుని మద్దతు ధరను పొందాలి.

– మహేశ్‌కుమార్, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్

ఎడపల్లిలో రైతుల రాస్తారోకో



రైతులను సముదాయిస్తున్న ఎడపల్లి పోలీసులు

బోధన్: ధాన్యం సేకరణను వెంటనే ప్రారంభించాలని రైతులు డిమాండ్‌చేశారు. కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినప్పటికీ ధాన్యం సేకరించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఎడపల్లిలోని బోధన్ – నిజామాబాద్ రహదారిపై రైతులు బుధవారం బైఠాయించారు. రాస్తారోకో కారణంగా పెద్ద సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న ఎస్సై ముత్యాల రమ సిబ్బందితో కలిసి ఘటనాస్థలానికి చేరుకుని రైతులతో మాట్లాడారు. ఎస్సై సముదాయించడంతో వారు ఆందోళనలను విరమించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. సొసైటీలు, ఐకేపీ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినప్పటికీ ధాన్యం సేకరించడం లేదని, తాము పక్షం రోజులుగా ఎదురు చూస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షం కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే ధాన్యం కొనుగోళ్లను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ధాన్యం సేకరణకు విస్తృత ఏర్పాట్లు

- పొరుగు రాష్ట్రాల ధాన్యం రాకుండా సరిహద్దుల్లో గట్టి నిఘా
- జిల్లాకు అదనంగా టార్పాలిన్లు కేటాయించండి
- వీడియోకాన్ఫరెన్స్‌లో మంత్రులతో కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

నిజామాబాద్ అర్బన్ : కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ సజావుగా సాగేలా విస్తృత ఏర్పాట్లు చేశామని కలెక్టర్ టి వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు. ఎక్కడ కూడా రైతులకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు ప్రణాళికతో అవసరమైన చర్యలు చేపట్టామన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఇతర ఉన్నతాధికారులతో కలిసి మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ధాన్యం సేకరణపై సమీక్షించారు. జిల్లాలో ధాన్యం సేకరణ ఏర్పాట్ల వివరాలను కలెక్టర్ మంత్రులకు వివరించారు. బాన్సువాడ, బోధన్ నియోజకవర్గాల పరిధిలోని పలు మండలాల్లో ధాన్యం దిగుబడులు వస్తున్న నేపథ్యంలో ఇప్పటికే 274 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామన్నారు. గత సీజన్ లో 606 కేంద్రాలు ఏర్పాటు చేయగా, ఈసారి 676 కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. అలాగే మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను కూడా అందుబాటులో ఉంచుతామన్నారు. జిల్లాకు 1582 అదనపు టార్పాలిన్లు కేటాయించాలని కలెక్టర్ కోరారు. వీసీ అనంతరం ధాన్యం సేకరణపై కలెక్టర్ సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, డీఆర్‌డీవో సాయాగౌడ్, డీఎస్‌వో అరవింద్‌రెడ్డి, సివిల్ సప్లయీస్ డీఎం శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి గోవిందు, డీసీవో శ్రీనివాస్, డీటీవో ఉమామహేశ్వర్ రావు, మార్కెటింగ్ ఏడీ గంగవ్వ, తూనికలు కొలతల శాఖ అధికారి సుజాత్ అలీ తదితరులు పాల్గొన్నారు.



వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

అభివృద్ధి పనులను పూర్తి చేయాలి



కార్పొరేషన్ కమిషనర్ దిలీప్‌కుమార్‌తో మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి

నిజామాబాద్ అర్బన్: ప్రజలకు మరింత మెరుగైన సదుపాయాలు అందుబాటులోకి తెచ్చేందుకు వీలుగా నగరంలో చేపడుతున్న అభివృద్ధి పనులను నిర్ణీత గడువు లోగా పూర్తి చేయాలని కలెక్టర్ టి వినయ్ కృష్ణారెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. నగరంలో కొనసాగుతున్న వివిధ పనులను కలెక్టర్ బుధవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. మాధవనగర్ వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్‌వోబీ) పనులతోపాటు ఖలీల్‌వాడిలో నిర్మాణంలో ఉన్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డు, అహ్మదీబజార్ వద్ద ఖిల్లా రోడ్డును ఆనుకుని అధునాతన సదుపాయాలతో నిర్మించిన సమీకృత మార్కెట్ సముదాయ భవనాన్ని, 80 క్వార్టర్స్, కలెక్టరేట్ పక్కన నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయా శాఖల అధికారులతో కలెక్టరేట్‌లో పనులపై సమీక్షించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ అంకిత్, ట్రెయినీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావి, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్‌కుమార్, హౌసింగ్ డీఈ నివర్తి, నిజామాబాద్ సౌత్ తహసీల్దార్ బాలరాజు తదితరులున్నారు.

నెట్‌బాల్ ప్రాబబుల్స్ క్రీడాకారుల ఎంపిక



ప్రాబబుల్స్ జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

నిజామాబాద్‌నాగారం: ఉమ్మడి జిల్లా (నిజామాబాద్, కామారెడ్డి) నెట్‌బాల్ అండర్–19 విభాగంలో బాలబాలికల ప్రాబబుల్స్ జిల్లా జట్టుకు ఎంపిక నిర్వహించారు. సారంగాపూర్ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో బుధవారం పోటీలు నిర్వహించి ప్రతిభ కనబర్చిన వారిని ఎంపిక చేశారు. శిక్షణ అనంతరం తుది జట్లను ఎంపిక చేయనున్నారు.

ప్రాబబుల్స్‌కు ఎంపికైన క్రీడాకారులు..

బాలికల విభాగం: డి అనుప్రియ, ఎస్ సింధు, డి ప్రతిభ, కె సరు, బి అక్షయ, యూ శృతి, ఏ రక్షిత, ఎం ప్రణీత, సీహెచ్ పురంధరేశ్వరి, యూ సంకీర్తన, కె కీర్తన, పి రక్షిత, బి సింధు, డి బాణవి, పి అలేఖ్య.

బాలుర విభాగం: జాన్ ప్రభాస్, ఐ అజయ్‌కుమార్, కె అరవింద్, పి దేవేందర్, డి అభ్యుదయ, డి సాయికుమార్, టి మహేశ్, హెచ్ నివర్తి, డి రాహుల్, ఎం నవనీత్, ఎండీ ముబాసిర్, ఎస్ అభిలాష్, వి నిఖిల్, శివకాంత్.

పీసీసీ చీఫ్‌ది అవగాహనారాహిత్యం



మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్ ధర్మపురి, పక్కన ఎమ్మెల్యే ధన్‌పాల్, పల్లె గంగారెడ్డి, స్రవంతిరెడ్డి

- ఆర్‌వోబీ నిధులు విడుదల చేయకపోతే నిరాహార దీక్ష
- బీసీ రిజర్వేషన్ల అంశంలో బీజేపీపై బురదజల్లే కుట్ర
- మీడియాతో ఎంపీ అర్వింద్ ధర్మపురి

సుభాష్‌నగర్: రైల్వే ఓవర్ బ్రిడ్జి(ఆర్‌వోబీ)లకు కేంద్రం నిధులు ఆగడం వల్లే పనులు ఆలస్యమవుతున్నాయని పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ అనడం అవగాహనారాహిత్యానికి నిదర్శనమని ఎంపీ అర్వింద్ ధర్మపురి విమర్శించారు. జిల్లాలోని మాధవనగర్, అర్సపల్లి, అడవి మామిడిపల్లి ఆర్‌వోబీలకు దీపావళి తర్వాత మూడు, నాలుగు రోజుల్లో నిధులు విడుదల చేయాలని, లేకపోతే నిరాహార దీక్షకు దిగుతానని అన్నారు. నగరంలోని బీజేపీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మహేష్‌కుమార్‌గౌడ్‌కు అవగాహన లేక కేంద్రంపై నెట్టేస్తున్నారని, ఇది సరైన పద్ధతి కాదన్నారు. సబ్జెక్ట్ తెలుసుకుని మీడియా ముందు మాట్లాడాలని హితవుపలికారు. మాధవనగర్ ఆర్‌వోబీలో సగం నిధులు తప్ప మిగతా అన్ని ఆర్‌వోబీలు కేంద్ర ప్రభుత్వ నిధులతోనే నిర్మిస్తున్నామన్నారు. ఆయా ఆర్‌వోబీలకు సంబంధించి 75 శాతానికి పైగా నిధులు రాష్ట్ర ఖజానాలో కేంద్రం జమ చేసిందని అర్వింద్ తెలిపారు. పథకాలు, అభివృద్ధి పనులు, వరద నష్టం, ఇతర బిల్లులకు నిధులు విడుదల చేయాలని కోరితే డబ్బులు లేవని సీఎం చెప్పడం సిగ్గుచేటన్నారు. జిల్లాకేంద్రంలో పసుపు బోర్డు కార్యాలయానికి రెండెకరాల స్థలం కేటాయించాలని ఎంపీ డిమాండ్‌చేశారు. బీసీ రిజర్వేషన్ల అంశంలో బీజేపీపై బురదజల్లే కుట్రలు చేస్తున్నారని, ఢిల్లీలో బీసీ ధర్నా చేసినప్పుడు రాహుల్‌గాంధీ ఎందుకు రాలేదన్నారు. రాజ్యాంగ సవరణ చేసి పార్లమెంట్‌లో బీసీ బిల్లు ఆమోదం తెలపాలని, అందుకు కాంగ్రెస్ చేసిన ప్రయత్నమేమిటని ప్రశ్నించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ అవినీతి పార్టీలని ఆరోపించారు.

డ్రగ్స్ సరఫరా సూత్రధారులెవరో?

జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఓట్ల చోరీ జరిగిందని కేటీఆర్ ఆరోపిస్తున్నారని, వాళ్ల హయాంలోనే ఆ ఓట్లు నమోదయ్యాయేమోనని అర్వింద్ విమర్శించారు. జూబ్లీహిల్స్‌లోనే అధికంగా క్లబ్‌లు ఉంటాయని, బీఆర్ఎస్ పాలనలో క్లబ్‌లకు డ్రగ్స్ సరఫరా ఎవరి కనుసన్నల్లో జరిగిందని ప్రశ్నించారు. ఆ బీఆర్ఎస్ కీలక నాయకుడెవరు.. కేసులు నమోదైతే నిర్వీర్యం చేసిందెవరో అందరికీ తెలుసన్నారు. కల్వకుంట్ల కుటుంబంతో దేశభద్రతకే ముప్పు అని విమర్శించారు. సమావేశంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి గోపిడి స్రవంతిరెడ్డి, నాయకులు న్యాలం రాజు, నాగోళ్ల లక్ష్మీనారాయణ, ప్రదీప్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు, మండలాల అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీకా కోసం వెళ్తూ అనంతలోకాలకు..

- టిప్పర్ రూపంలో ఎదురుగా వచ్చిన మృత్యువు
- తాత, ఇద్దరు మనుమలు, కుమార్తె మృతి
- జంగంపల్లిలో నెత్తురోడిన జాతీయ రహదారి



కిషన్ (ఫైల్)



జాస్లీన్ (ఫైల్)



ప్రభుత్వ ఆస్పత్రిలో చిన్నారి జాడ్సన్‌కు సీపీఆర్ చేస్తున్న వైద్యులు

భిక్కనూరు: టీకా వేయించేందుకు మూడు నెలల పసికందుతోపాటు వెళ్లిన ముగ్గురిని టిప్పర్ రూపంలో వచ్చిన మృత్యువు కబళించింది. భిక్కనూరు మండలం జంగంపల్లి బస్టాండ్ వద్ద జాతీయ రహదారిపై బుధవారం చోటు చేసు కున్న ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి చెందారు. పోలీసులు, స్థానికులు తెలిపిన ప్రకారం.. తాడ్వాయి మండలం కరడ్‌పల్లి గ్రామానికి చెందిన మెరుగు కిషన్ (54) అనే వ్యక్తి 20 ఏళ్లుగా ఆదిలాబాద్ జిల్లా రణదీవ్‌నగర్ చర్చిలో పాస్టర్‌గా పని చేస్తున్నాడు. వృద్ధులైన తల్లిదండ్రుల బాగోగులను ఒక నెల కిషన్, మరో నెల తన సోదరుడు చూసుకుంటున్నారు. ఈ క్రమంలో తన వంతు వచ్చినప్పుడు కిషన్ శాబ్దీపూర్ శివారులో ఉన్న అద్దె ఇంట్లో తల్లిదండ్రులతో కలిసి ఉండేవాడు. కిషన్ కుమార్తె జాస్లీన్ (30)కు ఖమ్మం జిల్లా ముష్టికుంటకు చెందిన పాస్టర్ ఆగమని ప్రకాశ్‌తో వివాహం చేశాడు. జాస్లీన్‌కు జోయల్ ప్రకాశ్(4), మూడు నెలల జాడ్సన్ అనే కుమారులు ఉన్నారు. జాస్లీన్ ఇటీవల కొడుకులతో వచ్చి తండ్రి, నానమ్మ–తాతయ్యలతో కలిసి ఉంటోంది. అయితే, జాడ్సన్ కు నెల టీకా ఇచ్చే సమయం అయ్యింది. దీంతో భిక్కనూరు ప్రభుత్వాసుపత్రిలో ఆశవర్క రుగా పనిచేసే బంధువును కలిసి జాడ్సన్‌కు టీకా ఇప్పించవచ్చని భావించిన జాస్లీన్ ఈ విషయాన్ని తండ్రి కిషన్‌కు వివరించింది. దీంతో కిషన్ తన ఎలక్ట్రిక్ స్కూటీపై జాస్లీన్, మనుమలు జోయల్ ప్రకాశ్, జాడ్సన్‌లను తీసుకొని భిక్కనూరుకు బయల్దేరాడు. జంగంపల్లి వద్ద జాతీయ రహదారిపై వెళ్తుండగా ఎదురుగా రాంగ్ రూటులో టిప్పర్ వేగంగా వచ్చి ఎలక్ట్రిక్ స్కూటీని ఢీకొట్టింది. దీంతో నలుగురు గాలిలో ఎగిరి కిందపడ్డారు. కిషన్, జాస్లీన్‌లు అక్కడికక్కడే మృతి చెందగా, కొన ఊపిరితో ఉన్న చి న్నారులు జోయల్ ప్రకాశ్, జాడ్సన్‌లను కామారెడ్డి ఆస్పత్రికి తరలించారు. వైద్యులు సీపీఆర్ చేసినా ప్రాణాలు దక్కలేదు. మార్గమధ్యంలోనే చిన్నారులిద్దరూ మరణించారు. ఘటనా స్థలాన్ని ఎల్లారెడ్డి డీఎస్పీ, కామారెడ్డి ఇన్‌చార్జి శ్రీనివాస్ రావు, రూరల్ సీఐ రామన్ పరిశీలించారు. డ్రైవర్ అజాగ్రత్తగా టిప్పర్‌ను రాంగ్‌రూట్‌లో నడపడంతోనే ఈ ప్రమాదం సంభవించిందని తెలిపారు. కేసు నమోదు చేసుకొని డ్రైవర్ రాజిరెడ్డిని అరెస్టు చేశామని ఎస్సై ఆంజనేయులు వివరించారు.

పోలీసు బందోబస్తు మధ్య గురుకుల పాఠశాల తరలింపు



సిరికొండ: మండలంలోని చీమన్‌పల్లిలో ఉన్న మహాత్మా జ్యోతి బాపూలే బాలికల గురుకుల పాఠశాలను పోలీసు బందోబస్తుతో ధర్పల్లి మండల కేంద్రంలోని అద్దె భవనంలోకి తరలించారు. చీమన్‌పల్లిలో సరైన వసతులు లేవని, విద్యార్థినులకు ఇబ్బంది అవుతోందని పాఠశాలను తరలించాలని సంబంధిత శాఖ అధికారులు ఇటీవల నిర్ణయించారు. కానీ పాఠశాల తరలింపును గ్రామస్తులు వ్యతిరేకిస్తూ వారం క్రితం సామగ్రి తరలింపును అడ్డుకున్నారు. మంగళవారం కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి పాఠశాలను సందర్శించిన మరుసటి రోజే తెల్లవారుజామున ధర్పల్లి సీఐ భిక్షపతి, ఎస్సై రామకృష్ణ వందలాది మంది సిబ్బందితో పాఠశాలకు చేరుకున్నారు. జ్యోతిబాపూలే సొసైటీ ఆర్‌సీవో సత్యనాథ్‌రెడ్డి, డీసీవో శ్రీకాంత్, తహసీల్దార్ రవీందర్‌రావు, పోలీసుల ఆధ్వర్యంలో పాఠశాలలోని సామగ్రిని డీసీఎంలలో, విద్యార్థినులను ప్రైవేటు పాఠశాలల బస్సుల్లో తరలించారు. వాహనాలను ఎవరు అడ్డగించకుండా పోలీసులు ఎస్కార్టుగా వెళ్లారు.

క్లుప్తంగా

ఉర్దూ విభాగాధిపతిగా మహ్మద్ అబ్దుల్ ఖవి



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ ఉర్దూ విభాగాధిపతి (హెచ్‌వోడీ)గా మహ్మద్ అబ్దుల్ ఖవి నియమితులయ్యారు. వీసీ టి యాదగిరిరావు ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ఎం యాదగిరి బుధవారం అబ్దుల్ ఖవికి నియామకపు ఉత్తర్వులు అందించారు. అబ్దుల్ ఖవికి ఉర్దూ విభాగంలో 12 సంవత్సరాల బోధన, పరిశోధన అనుభవం ఉంది. వర్సిటీ మైనారిటీ సెల్ డైరెక్టర్‌గా, అరబిక్ విభాగం బీవోఎస్ చైర్మన్‌గా, ఉర్దూ బీవోఎస్ చైర్మన్‌గా, ఏపీఆర్వోగా, చీఫ్ వార్డెన్‌గా, స్పోర్ట్స్ అండ్ గేమ్స్ డైరెక్టర్‌గా, యూత్ వెల్ఫేర్ ఆఫీసర్‌గా, అడిషనల్ కంట్రోలర్‌గా పలు అడ్మిన్, అకడమిక్ పదవులను సమర్థవంతంగా నిర్వర్తించారు. ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం నుంచి తెలంగాణ ఉర్దూ అకాడమీ ఆధ్వర్యంలో పరిశోధక – విమర్శరంగంలో అబ్దుల్ ఖవి కి లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డు అందుకున్నారు.

ముగిసిన ఎంఈడీ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో జరుగుతున్న ఎంఈడీ 2వ సెమిస్టర్ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ముగిసినట్లు అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ ఘంటా చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం జరిగిన పరీక్షకు 29 మంది విద్యార్థులకు గానూ 29 మంది హాజరైనట్లు ఆయన తెలిపారు.

ఆర్థికసాయం అందజేత



కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలో ఇటీవల ఐకేపీ సీసీ రాజేశ్వర్ మృతిచెందారు. దీంతో బాధిత కుటుంబాన్ని బుధవారం జిల్లా టీఎన్జీవోస్ అధ్యక్షుడు, జిల్లా ఎంప్లాయీస్ జేఏసీ చైర్మన్ నాశెట్టి సుమన్ పరామర్శించారు. జిల్లా ఐకేపీ సిబ్బంది విరాళాల ద్వారా జమ చేసిన రూ. 75వేలను టీఎన్జీవో కార్యదర్శి శేఖర్, ఐకేపీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కుంట గంగాధర్, జిల్లా జేఏసీ చైర్మన్ మాణిక్యం, రవి విఠల్‌తో కలిసి మృతుడి భార్యకు అందజేశారు. ఈసందర్భంగా సుమన్ మాట్లాడుతూ.. విధి నిర్వహణలో ఉంటూ అకాల మరణం చెందిన సెర్ప్, ఐకేపీ సిబ్బంది కుటుంబీకులకు కారుణ్య నియామకాలతోనే భరోసా లభిస్తుందని అన్నారు.

వర్షానికి తడిసిన ధాన్యం



వర్ని: పాత వర్ని, అక్బర్ నగర్, సత్యనారాయణపురం శివార్లలో బుధవారం మధ్యాహ్నం వర్షం కురిసింది. దీంతో రైతులు రోడ్డుపై ఆరబెట్టిన వరి ధాన్యం తడిసింది. అకస్మాత్తుగా వర్షం రావడంతో అందుబాటులో ఉన్న రైతులు ధాన్యం కుప్పలపై కవర్లు కప్పి తడవకుండా జాగ్రత్త పడ్డారు. కొందరు రైతులు అందుబాటులో లేకపోవడంతో సుమారు 50 క్వింటాళ్ల వరకు వరి ధాన్యం తడిసింది.

కానిస్టేబుల్‌పై బదిలీవేటు

నిజామాబాద్ అర్బన్: నగరంలోని ఒకటోటౌన్ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్‌ను సీపీ సాయిచైతన్య బుధవారం బదిలీ చేశారు. కానిస్టేబుల్ ఖలీద్‌పై పలు ఆరోపణలు రావడంతో ఉన్నతాధికారులు ఇటీవల విచారణ చేపట్టారు. ఈక్రమంలో అతడిని బోధన్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు.

ఎర్రజొన్నకు బదులు మొక్కజొన్న

- యాసంగిలో పెరుగుతున్న మక్క సాగు విస్తీర్ణం
- ఎర్రజొన్న వ్యాపారుల మోసాలతో విసిగిపోతున్న రైతులు
- ప్రత్యామ్నాయ పంటలవైపు మొగ్గు



ఆర్మూర్ శివారులోని మక్క పంటలో కలుపు తీస్తున్న రైతులు

ఆర్మూర్: ఎర్రజొన్న రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగువైపు మొగ్గుచూపుతున్నారు. జిల్లాలో ప్రతీ ఏటా ఎర్రజొన్న రైతులను విత్తన వ్యాపారులు సిండికేట్‌గా మారి మోసం చేస్తుండటంతో అన్నదాతలు పంట మార్పిడి విధానాన్ని అవలంభించి వారి మోసాల బారిన పడకుండా జాగ్రత్త పడుతున్నారు. అందులో భాగంగా ఈ యాసంగిలో ఎర్రజొన్నకు బదులుగా మొక్కజొన్నను పండించడానికి ఆసక్తి చూపుతున్నారు. దీంతో జిల్లా వ్యాప్తంగా ప్రస్తుత సీజన్‌లో ఎర్రజొన్న విస్తీర్ణం తగ్గి మొక్కజొన్న విస్తీర్ణం గణనీయంగా పెరగనుంది.

గతంలో..

మార్కెట్‌లో మొక్కజొన్నకు డిమాండ్ ఉన్నా.. పెట్టుబడి వ్యయం, శ్రమ ఎక్కువ కావడంతోపాటు తెగుళ్ల సహా ఇతర కారణాలతో గతంలో మొక్కజొన్న విస్తీర్ణం గణనీయంగా తగ్గి, ఎర్రజొన్న విస్తీర్ణం పెరిగింది. కానీ ప్రతియేటా ఎర్రజొన్న విత్తన వ్యాపారులు బైబ్యాక్ ఒప్పందాలు చేసుకొని పంట చేతికి వచ్చిన సమయంలో కొనుగోలు చేయకుండా ముఖం చాటేయడంతో రైతులు వచ్చిన నామమాత్రపు ధరకే ఎర్రజొన్న పంటను అమ్ముకొని ఆర్థికంగా నష్టపోతున్నారు. దీంతో అన్నదాతలు ప్రస్తుతం ఎర్రజొన్నకు బదులుగా మొక్కజొన్న పండించడానికే ఆసక్తి చూపుతున్నారు.

సుమారు 30వేల ఎకరాల్లో..

అక్టోబర్ నెలలో విత్తుకొనే ఎర్రజొన్నల విస్తీర్ణం ప్రతీ ఏటా గణనీయంగా తగ్గుతూ వస్తోంది. 2023–24 యాసంగిలో 34,086 ఎకరాల్లో, 2024–25లో 25,447 ఎకరాల్లో ఎర్రజొన్నలు పండించారు. ప్రత్యామ్నాయంగా మొక్కజొన్నను పండించడానికి రైతులు ఆసక్తి చూపుతున్నారు. వ్యవసాయ శాఖ ముందస్తు ప్రణాళిక ప్రకారం ఈ యాసంగిలో మొక్కజొన్న పంట విస్తీర్ణం 30 వేల ఎకరాలకు చేరువలో ఉండబోతోంది. మొక్కజొన్న పచ్చి బుట్ట పంట 90 రోజుల్లో చేతికొస్తుంది. ఇలా వచ్చిన పచ్చి బుట్టల దిగుబడికి బహిరంగ మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది.

వ్యాపారులు మోసం చేస్తున్నారు..



ఎర్రజొన్న విత్తన వ్యాపారులు బై బ్యాక్ ఒప్పందాన్ని ఉల్లంఘించి ప్రతీయేటా రైతులను మోసం చేస్తూనే ఉన్నారు. సిండికేట్‌గా మారిన వారిని నియంత్రిండంలో ప్రభుత్వం విఫలం అవుతోంది. కాబట్టి ఎర్రజొన్నకు బదులు గా రైతులు మొక్కజొన్నను పండించడానికి ఆసక్తి చూపుతున్నారు.

–బార్ల మనీష్, రైతు, ఆలూర్ మండలం

అధిక దిగుబడి సాధించాలి..



రైతులు మొక్కజొన్న పంట పండించే సమయంలో మెరుగైన యాజమాన్య పద్ధతులు పాటిస్తూ పంట దిగుబడిని పెంచుకోవాలి. ఆర్మూర్, అంకాపూర్‌లో పచ్చిబుట్ట కొనుగోలుకు వ్యాపారులు ఆసక్తి చూపుతారు. కాబట్టి ఈ మార్కెట్‌ను ఉపయోగించుకోవాలి.

– హరికృష్ణ, వ్యవసాయశాఖ అధికారి, ఆర్మూర్

మరోసారి రెండుగా చీలిన తొర్తి

- గతంలో నమోదైన కేసులలో రాజీ కుదరకపోవడంతో విడిపోయిన గ్రామస్తులు
- ఉద్రిక్తతలు చోటు చేసుకోకుండా పికెటింగ్ ఏర్పాటు చేసిన పోలీసులు



తొర్తిలో ఏర్పాటు చేసిన పోలీసు పికెటింగ్

మోర్తాడ్(బాల్కొండ): ఏర్గట్ల మండలం తొర్తి గ్రామస్తులు మంగళవారం మరోసారి రెండు వర్గాలుగా విడిపోయారు. గతంలో నమోదైన కేసులలో రాజీ కుదురకపోవడంతో ఒక వర్గానికి చెందిన దాదాపు వంద కుటుంబాలు ఒకవైపు, మెజార్టీ కులాలకు చెందిన 320 కుటుంబాలు మరోవైపు ఉండిపోయారు. దీంతో ఉద్రిక్తతలు చోటుచేసుకుంటాయనే సందేహంతో పోలీసులు మంగళవారం నుంచి పికెటింగ్ నిర్వహిస్తున్నారు.

2021లో వరి కోతల విషయంలో రెండుగా చీలిపోయిన తొర్తిలో కొంత కాలం వర్గపోరు కొనసాగింది. పోలీసులు, రెవెన్యూ అధికారులు సంప్రదింపులు జరిపి గ్రామస్తులను ఐక్యం చేశారు. ఈక్రమంలో వంద కుటుంబాలు ఉన్న వర్గం వారిపై గతంలోనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. ఆ కేసు కోర్టులో విచారణకు రాగా సాక్షులుగా ఉన్న వారు కోర్టుకు హాజరయ్యారు. గ్రామంలో అందరం కలిసిపోయినా కేసుల విషయంలో రాజీ కుదురకపోవడంతో వంద కుటుంబాల వారు మళ్లీ కట్టడి చేసుకున్నారు. గతంలో మాదిరిగానే విడిపోయి ఉండాలని తీర్మానించుకున్నారు. రెండో వర్గం వారు దీనిని విభేదించడంతో గ్రామంలో రెండు వర్గాలు ఏర్పడ్డాయి. గ్రామస్తులు కలిసిపోయిన సమయంలోనే కేసుల విషయంలో రాజీ కుదిరి ఉంటే ఇప్పుడు వివాదం ఏర్పడేది కాదనే అభిప్రాయం వ్యక్తం అవుతుంది.

ఇరువర్గాలు సహకరించాలి

తొర్తిలో ఏర్పడిన వివాదం వల్ల శాంతి భద్రతలకు భంగం వాటిల్లకుండా ఉండటానికి పోలీసు పికెటింగ్ నిర్వహిస్తున్నాం. ఇరు వర్గాలు పోలీసులకు సహకరించాలి. ఎవరైన చట్టానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

–పడాల రాజేశ్వర్, ఎస్సై, ఏర్గట్ల

నేడు ఆర్ట్స్ కళాశాలలో ఫుడ్ ఫెస్టివల్, ఈకో బజార్

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రాంగణంలో గురువారం ఫుడ్ ఫెస్టివల్, క్యాంపస్ ఈకో బజార్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ విజయ్‌కుమార్ తెలిపారు. విద్యార్థులకు వస్తువుల అమ్మకం, మార్కెటింగ్ ప్రణాళిక, నాయకత్వ లక్షణాలు, నైపుణ్యాలు, స్టాళ్ల ఏర్పాటు, సుందరీకరణ, పర్యావరణ స్నేహ పూర్వక ఉత్పత్తులు, సేవలను తెలియజేయడానికి ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని ప్రిన్సిపల్ వివరించారు.

అపోలో ఫార్మసీలో ఉద్యోగ మేళా

కామారెడ్డి అర్బన్: అపోలో ఫార్మసీలో ఉద్యోగాల కోసం ఈనెల 17న ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కలెక్టరేట్‌లోని 121 నంబర్ గదిలో ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎం.రజనీ కిరణ్ ఒక ప్రకటనలో తెలిపారు. డి-ఫార్మా, బి-ఫార్మా(పీసీఐ) అర్హతతో స్త్రీ, పురుష ఫార్మసిస్టులకు 40 ఖాళీలు (రూ.17,644 వేతనం), డి-ఫార్మా, బి-ఫార్మా అర్హతతో పురుషులకు ట్రెయినీ ఫార్మసిస్టులకు 20 (రూ.16,144 వేతనం), పదవ తరగతి అర్హతతో ఫార్మసీ అసిస్టెంట్ పురుషులకు 30(రూ.15,879 వేతనం), రిటైల్ ట్రెయినీ 10 ఖాళీలు పురుషులకు (రూ.12వేల వేతనం) ఉన్నాయని పేర్కొన్నారు. వివరాలకు 72079 17714, 76719 74009 నంబర్లకు సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

క్రైం కార్నర్

ఒకే కుటుంబంలోని ముగ్గురి ఆత్మహత్యాయత్నం

- మృతిచెందిన తండ్రి, చికిత్స పొందుతున్న తల్లి, కొడుకు
- పెళ్లి విషయమై గొడవలే కారణం



దాసరి కిషన్ (ఫైల్)

నిజామాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని శివాజీనగర్‌లో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఇందులో తండ్రి మృతి చెందగా, తల్లి, కొడుకు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. రెండో టౌన్ ఎస్సై గంగాధర్ తెలిపిన వివరాలు ఇలా.. శివాజీనగర్ కు చెందిన దాసరి కిషన్(68)కు భార్య నాగమణి, ఇద్దరు కొడుకులు వంశీ, బాలకృష్ణ ఉన్నారు. పెద్దకొడుకు వంశీ గల్ఫ్‌కు వెళ్లి తిరిగి వచ్చి, మద్యానికి బానిసయ్యాడు. చిన్న కొడుకు బాలకృష్ణతో కలిసి కిషన్ కర్రీ పాయింట్ నిర్వహిస్తున్నాడు. బాలకృష్ణకు వివాహం జరుగగా, వంశీకి పెళ్లి కాలేదు. ఈవిషయమై మంగళవారం అతడు తల్లిదండ్రులతో గొడవపడ్డాడు. దీంతో వంశీ గడ్డిమందు తాగి చనిపోతానంటూ మందు తాగాడు. వెంటనే వంశీ నుంచి తల్లి గడ్డిమందు డబ్బా తీసుకొని ఆమె తాగింది. ఆమె నుంచి కిషన్ డబ్బా తీసుకొని తాగాడు. దీంతో ముగ్గురు అపస్మారకస్థితిలోకి వెళ్లిపోయారు. స్థానికులు గమనించి వారిని వెంటనే చికిత్స కోసం ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. బుధవారం తెల్లవారుజామున కిషన్ చికిత్స పొందుతు మృతిచెందగా, మిగిలిన ఇద్దరిని మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. ఈ ఘటనపై మృతుడి చిన్నకుమారుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఘటన స్థలానికి వెళ్లి వారు విచారణ చేపట్టారు. కిషన్ మృతిచెందిన విషయాన్ని ఆస్పత్రి యాజమాన్యం పోలీసులకు ఇవ్వకపోవడం, మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించడంపై పోలీసులు ఆస్పత్రికి నోటీసులు జారీ చేశారు.

ట్యాంకర్‌ను ఢీకొన్న బస్సు

- ముగ్గురు ప్రయాణికులకు స్వల్ప గాయాలు



డిచ్‌పల్లి: మండలంలోని హైవేపై ఓ ప్రయివేట్ బస్సు అదుపుతప్పి ఇంధన ట్యాంకర్‌ను ఢీకొని, సమీపంలోని ఏడో బెటాలియన్ పెట్రోల్ బంక్‌లోకి దూసుకెళ్లింది. ఈఘటనలో ముగ్గురు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. డిచ్‌పల్లి ఎస్సై ఎండీ షరీఫ్ తెలిపిన వివరాలు ఇలా.. హరికృష్ణ ట్రావెల్స్‌కు చెందిన బస్సు బుధవారం హైదరాబాద్ నుంచి జగిత్యాలకు బయలుదేరింది. డిచ్‌పల్లిలోని పోలీస్ పెట్రోల్ బంక్ వద్దకు రాగానే బస్సు ముందు వెళుతున్న ట్యాంకర్‌ను ఢీకొని బంకులోకి దూసుకెళ్లింది. దీంతో పెట్రోల్ బంక్‌లో ఉన్న వాహనదారులు, సిబ్బంది ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. అయితే బస్సు సమీపంలోకి వచ్చి నిలిచిపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. బస్సులో ఉన్న ముగ్గురు ప్రయాణికులకు స్వల్పగాయాలయ్యాయి. అజాగ్రత్తగా బస్సు నడిపి ప్రమాదానికి కారణమైన డ్రైవర్ ప్రభాకర్ తేజపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

స్తంభాన్ని ఢీకొన్న బైక్: ఒకరి మృతి



లక్ష్మణ్ (ఫైల్)

ఎల్లారెడ్డి: మండలంలో బైక్ అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొనడంతో ఒకరు అక్కడికక్కడే మృతి చెందారు. ఎస్సై మహేశ్ వివరాలు ఇలా.. వెల్లుట్ల గ్రామానికి చెందిన పండుగ లక్ష్మణ్(36) బుధవారం మోటార్ సైకిల్‌పై బాన్సువాడ నుంచి గ్రామానికి బయలుదేరాడు. ఆజామాబాద్ గ్రామ శివారులోని మూల మలుపు వద్ద బైక్ అదుపుదప్పి కరెంట్ స్తంభాన్ని ఢీకొన్నాడు. ఈ ఘటనలో అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

రైలు ప్రమాదంలో ఒకరు..

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ రైల్వేస్టేషన్–జాన్కంపేట స్టేషన్‌ల మధ్య రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందినట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి తెలిపారు. వివరాలు ఇలా.. జిల్లా కేంద్రంలోని దుబ్బకు చెందిన ట్రాన్స్‌జెండర్ మీరా అలియాస్ నారాయన్ కామాజీ అనే వ్యక్తి బుధవారం మధ్యాహ్నం నిజామాబాద్ రైల్వేస్టేషన్–జాన్కంపేట స్టేషన్‌ల మధ్య పట్టాలపై వస్తున్న రైలుకు ఎదురువెళ్లారు. ఈక్రమంలో రైలు ఢీకొని తీవ్ర గాయాలై మృతిచెందారు.ఈ ఘటన కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

చెరువులో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

ఎల్లారెడ్డి: చెరువులో చేపలు పట్టడానికి వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతిచెందిన వ్యక్తి మృతదేహం బుధవారం లభ్యమయ్యింది. వివరాలు ఇలా.. బాలాజీనగర్ తండాకు చెందిన రుడావత్ గణేశ్ (48) మంగళవారం చేపలు పట్టడానికి ఎల్లారెడ్డి పెద్దచెరువులో దిగగా ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెందాడు. పోలీసులు మృతదేహం కోసం గాలించగా బుధవారం మధ్యాహ్నం లభ్యమయ్యింది. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని శవాన్ని పోస్టుమార్టానికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న బస్సు: ఇద్దరికి గాయాలు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలో ఆర్టీసీ బస్సు బైక్‌ను ఢీకొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. ఆర్టీసీ బస్సు నిజామాబాద్ నుంచి హన్మకొండకు బయలుదేరింది. ఈక్రమంలో పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో బైక్‌ను బస్సు వెనుకనుంచి వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో బైక్‌పై ఉన్న ఇద్దరికి గాయాలయ్యాయి. ఆర్టీసీ డ్రైవర్ అజాగ్రత్తగా వాహనాన్ని నడపడంతో ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు.. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించి, ఇరువురిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు

విద్యుత్ షాక్‌తో జీపీ కార్మికుడికి ..



బీబీపేట: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్మికుడు విద్యుత్ షాక్‌తో గాయపడ్డాడు. వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన జీపీ కార్మికుడు కొంగరి చంద్రం బుధవారం పెద్దమ్మ ఆలయం సమీపంలో విద్యుత్ బల్బులు అమర్చడానికి స్తంభం ఎక్కాడు. అప్పటికే విద్యుత్ సరఫరా ఉండడంతో అతని చేతులకు విద్యుత్ షాక్ తగిలి కింద పడిపోయాడు. దీంతో కుడి కాలు విరిగింది. స్థానికులు వెంటనే అతడిని కామారెడ్డి ఆస్పత్రికి తరలించారు.

విద్యార్థులకు ఇబ్బందులు కలిగించొద్దు

- కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి
- జిల్లాలోని బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ యాజమాన్యాలతో సమావేశం



మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

నిజామాబాద్ అర్బన్: బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పథకం కింద ప్రయివేటు పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు యాజమాన్యాలు ఎలాంటి ఇబ్బందులు కలిగించొద్దని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. నగరంలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో బుధవారం బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ కరెస్పాండెంట్లు, ప్రిన్సిపాల్స్‌తో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూన.. ఏమైనా సమస్యలు ఉంటే జిల్లా యంత్రాంగం, ప్రభుత్వం దృష్టికి తెచ్చి పరిష్కరించుకోవాలని యాజమాన్యాలకు సూచించారు. బెస్ట్ అవైలబుల్ స్కీం విద్యార్థులు పట్ల వివక్షను ప్రదర్శించకూడదని స్పష్టం చేశారు. బకాయిల చెల్లింపుల విషయమై ప్రభుత్వం సానుకూలంగా ఉందని, విద్యార్థులకు మెరుగైన విద్య, నాణ్యమైన వసతుల కల్పనకు చొరవ చూపాలన్నారు. అదనపు కలెక్టర్ అంకిత్, ట్రెయినీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

భూభారతి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

నిజామాబాద్ అర్బన్: భూభారతి పెండింగ్ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని గ్రామపాలన అధికారులను కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి ఆదేశించారు. నగరంలోని కలెక్టరేట్ నుంచి బుధవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జీపీవోలతో సమీక్ష నిర్వహించారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలిస్తూ క్షేత్రస్థాయిలో పక్కాగా విచారణ జరపాలని సూచించారు. సాదాబైనామా, పీవోటీలకు సంబంధించిన దరఖాస్తుల పరిశీలననను కూడా పూర్తి చేయాలని సూచించారు. అర్జీలను త్వరగా పరిష్కరించి సంబంధిత రైతులకు న్యాయం చేయవలసిన బాధ్యత అధికారులదేనని స్పష్టం చేశారు. అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, ఆయా క్లస్టర్ల గ్రామ పాలన అధికారులు పాల్గొన్నారు.

అభిప్రాయాల సేకరణ తర్వాతే డీసీసీ నియామకం



మాట్లాడుతున్న ఏఐసీసీ పరిశీలకుడు రిజ్వాన్

నందిపేట్(ఆర్మూర్): క్షేత్రస్థాయిలో కచ్చితమైన అభిప్రాయాలు సేకరించిన తర్వాతనే డీసీసీల నియామకాలు చేపడతామని కర్ణాటక ఎమ్మెల్యే, ఏఐసీసీ పరిశీలకులు రిజ్వాన్ అర్షద్ అన్నారు. నందిపేట మండలంలోని వెల్మల్ గ్రామంలో బుధవారం ఆర్మూర్ నియోజకవర్గంలోని నందిపేట, మాక్లూర్, డొంకేశ్వర్ మండలాల ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా రిజ్వాన్ అర్షద్‌ను నాయకులు ఘనంగా సన్మానించారు. అనంతరం రిజ్వాన్ మాట్లాడుతూ.. రాహుల్ గాంధీని ప్రధానమంత్రిగా చేసేందుకు ప్రక్రియలో భాగంగానే డీసీసీ పదవి నియామకంలో పార్టీ నాయకులు, కార్యకర్తల అభిప్రాయ సేకరణ చేపట్టామన్నారు. అభిప్రాయల నివేదికను పార్టీ అధిష్టానానికి పంపిస్తామని తెలిపారు. అనంతరం జిల్లా పార్టీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ మాట్లాడుతూ.. పార్టీ సంస్థాగత నిర్మాణానికి మరింత బలోపేతం చేసేందుకు డీసీసీల పదవుల నియామకానికి ఏఐసీసీ సరికొత్త విధానానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మార చంద్రమోహన్, మంద మహిపాల్, భూమేశ్వర్‌రెడ్డి, రవి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలి



జ్యోతి బాపూలే పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్న జడ్జి ఉదయ్‌భాస్కర్‌రావు



వంటగదిని పరిశీలిస్తూ..

బోధన్: సంఘసంస్కర్తలు మహాత్మ జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి దంపతులను ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు భవిష్యత్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఉదయ్‌భాస్కర్‌రావు సూచించారు. పట్టణంలోని ఆచన్‌పల్లి ప్రాంతంలోగల మహాత్మా జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాల, బెల్లాల్ ప్రాంతంలోని ఎస్సీ బాలుర గురుకుల కళాశాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఆయన విద్యార్థినులతో మాట్లాడారు. నేటి పోటీ ప్రపంచంలో చదువు ప్రాముఖ్యతను వివరించి, లక్ష్యంతో చదివితే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని తెలిపారు. చదువుకు సంబంధించి ఎలాంటి సందేహాలున్నా ఉపాధ్యాయులతో అడిగి నివృత్తి చేసుకోవాలని సూచించారు. అనంతరం బెల్లాల్ ప్రాంతంలోని ఎస్సీ బాలుర గురుకుల కళాశాలను సందర్శించారు. ఇరుకుగా ఉన్న తరగతి గదిలోనే నిద్రిస్తున్నామని విద్యార్థులు జడ్జి దృష్టికి తీసుకెళ్లారు. ఇక్కడిపరిస్థితుల సమగ్ర నివేదికను ఉన్నత న్యాయస్థానానికి నివేదిస్తామని ఆయన వెల్లడించారు. జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ సిబ్బంది శ్రావణ్, మృణాళిని, పారాలీగల్ వలంటీర్స్ పద్మాసింగ్, రమణారెడ్డి, న్యాయవాది ఆశా నారాయణ తదతరులు ఉన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

ఎల్లారెడ్డి: పట్టణంలోని వైన్స్‌లో ఇటీవల చోరీకి పాల్పడిన నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ రాజారెడ్డి బుధవారం తెలిపారు. వివరాలు ఇలా.. పట్టణంలోని త్రిశూల్ వైన్స్‌లో ఈనెల 12న చోరీ జరిగింది. క్యాష్ కౌంటర్‌లో ఉన్న రూ.15 వేలను అపహరణకు గురయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేపట్టారు. సీసీ పుటేజీలను పరిశీలించగా నిందితుడిగా మండలంలోని పోసానిపల్లి గ్రామానికి చెందిన జంగం నర్సింలుగా గుర్తించారు. అతడిని ఇంటి వద్ద అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు. కూలీ పనులు చేసుకునే నిందితుడు మద్యం కోసం డబ్బులు చాలక చోరీలకు పాల్పడుతుంటాడని ఆయన తెలిపారు.

రైళ్లలో చోరీలకు పాల్పడుతున్న ఇద్దరి ..

నిజామాబాద్‌సిటీ: రైళ్లలో చోరీలకు పాల్పడుతున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి తెలిపారు. వివరాలు ఇలా.. నిజామాబాద్ రైల్వేస్టేషన్‌లోని ప్లాట్‌ఫాంపై బుధవారం ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా తిరుగుతుండటంతో వారిని రైల్వే పోలీసులు పట్టుకున్నారు. వారిని విచారించగా మహారాష్ట్రకు చెందిన భగీరథ, ఫికిలాల్‌గా గుర్తించారు. వారు రైళ్లలో తరచు దొంగతనాలకు పాల్పడుతున్నట్లు అంగీకరించారు. నిందితులు సుమారు 36 గ్రాముల బంగారం, 155 గ్రాముల వెండి, రూ.లక్ష 32 వేలు నగదును దొంగలించినట్లు అంగీకరించారు. వీరిపై కేసు నమోదు చేసి విచారణ కొనసాగుతున్నట్లు ఎస్సై తెలిపారు.

పేకాడుతున్న 15మంది అరెస్టు

రుద్రూర్: కోటగిరిలోని రెండు పేకాట స్థావరాల్లో పేకాట ఆడుతున్న 15 మందిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై సునీల్ బుధవారం తెలిపారు. కోటగిరి రిక్రియేషన్ క్లబ్‌లో పేకాట స్థావరంపై దాడి చేసి ఐదుగురిని పట్టుకుని వారి వద్ద నుంచి రూ. 13,610 నగదు, ఐదు ఫోన్లు, రెండు బైక్‌లను స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే కోటగిరిలోని ఓ ఇంట్లో పేకాడుతున్న పదిమందిని పట్టుకుని వారి వద్ద నుంచి రూ. 15,190 నగదు, పది ఫోన్లు, ఆరు బైక్‌లను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఒకరు తప్పించుకున్నట్టు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

సాలూర మండలంలో..

బోధన్‌రూరల్: సాలూర మండలంలోని ఖాజాపూర్ గ్రామంలో పేకాట స్థావరంపై దాడి చేసి పేకాడుతున్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఎస్సై మచ్చేందర్ రెడ్డి బుధవారం తెలిపారు. వారి వద్ద నుంచి రూ.15,040 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు వివరించారు.

నందిపేట మండలంలో..

నందిపేట్ (ఆర్మూర్): మండలంలోని దేవి పట్టణం గ్రామంలో పేకాట స్థావరంపై పోలీసులు దాడిచేసి, పేకాడుతున్న ఏడుగురిని పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 21,600 నగదుతోపాటు 6ఫోన్లను స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్యామ్ రాజ్ తెలిపారు.

విద్యార్థి అదృశ్యం



అక్మత్‌బేగ్

రెంజల్(బోధన్): మండలంలోని సాటాపూర్ గ్రామానికి చెందిన అక్మత్‌బేగ్ అనే ఇంటర్ విద్యార్థి అదృశ్యమైనట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. సదరు విద్యార్థి బుధవారం బోధన్‌లోని కళాశాలకు వెళుతున్నట్లు చెప్పి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. సాయంత్రం వరకు ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు, బంధువులు అతడి కోసం గాలించినా ఆచూకీ లభించలేదు. దీంతో విద్యార్థి తండ్రి కరామత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

బీబీపేటలో ఒకరు..



నాగరాజుగౌడ్

బీబీపేట: మండల కేంద్రానికి చెందిన బట్టుపల్లి నాగరాజుగౌడ్ (33) అనే వ్యక్తి అదృశ్యమైనట్లు ఎస్సై ప్రభాకర్ బుధవారం తెలిపారు. నాగరాజు గౌడ్ మంగళవారం తెల్లవారుజామున ఇంట్లో నుంచి ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు ఎంత వెతికినా అతడి ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో అతడి తండ్రి సిద్దరామగౌడ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, వారు కేసు నమోదు చేశారు. ఎవరికైన అతడి ఆచూకీ తెలిస్తే పోలీసు స్టేషన్‌లో తెలపాలని ఎస్సై పేర్కొన్నారు.

తప్పిపోయిన విద్యార్థి ఆచూకీ లభ్యం

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని ఓ ప్రయివేట్ కళాశాల నుంచి అదృశ్యమైన విద్యార్థి ఆచూకీ లభించిందని పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు. సదరు విద్యార్థి రెండు రోజుల క్రితం కళాశాల నుంచి బయటకు వెళ్లిపోయాడు. దీంతో విద్యార్థి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు దర్యాప్తు చేపట్టారు. సదరు విద్యార్థి నిజాంసాగర్‌లో ఉన్నట్లు సమాచారం అందడంతో అక్కడి వెళ్లిన సిబ్బంది అతడిని అదుపులోకి తీసుకొని వారి తల్లిదండ్రులకు అప్పగించినట్లు సీఐ వెల్లడించారు.